ప్రజాశక్తి
శనివారం 17 ఆగస్టు 2024 | 5 | అనంతపురం

వేగంగా తుంగభద్ర డ్యామ్
గేట్ పునరుద్ధరణ పనులు
రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అత్యంత వేగవంతంగా తుంగభద్ర డ్యామ్ గేట్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆర్అండ్బి అతిథి గహంలో తుంగభద్ర డ్యామ్లో గేట్ పునరుద్ధరించే ప్రక్రియపై మాట్లాడారు. గేట్ ఏర్పాటుకు సంబంధించి అడ్డంకిగా పైనున్న 30 టన్నుల కౌంటర్ వైట్ని శుక్రవారం కిందికి దించినట్లు చెప్పారు. అతి జాగ్రత్తగా, సురక్షితంగా దానిని కిందకు తెచ్చారన్నారు. పనులు పునరుద్ధరణలో ఇది మొదటి విజయంగా భావించవచ్చన్నారు. మొదటి గేటు దించడం విజయవంతం అయితే రెండు, మూడు గేట్లు కూడా దించడం సులభతరం అవుతుందనే నమ్మకంతో ఉన్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందరాదని, ప్రభుత్వం, తామంతా పనురద్ధరణ కోసం పని చేస్తున్నామని పేర్కొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాదర్బార్ సమస్యలకు సత్వర పరిష్కారం

వివిధ సమస్యలపై 'ప్రజాదర్బార్లో ప్రజలు అందించే వినతులకు సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు అనంతపురం నగరంలోని ఆర్అండ్బి అతిథి గహంలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన వెంటనే అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఊపిరిపోయని ఓడీఓపీ..!

వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రాడక్టు (ఒడిఒపి) కింద గార్మెంట్ పరిశ్రమ కోసమని రాయదుర్గం టెక్స్టైల్స్ను ఎంపిక చేశారు. దీని కింద రాయదుర్గంలో తయారయ్యే గార్మెంట్ పరిశ్రమకు ఊతమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆచరణలో అవి కేవలం నోటిమాటలుగానే మిగిలిపోయాయి. గార్మెంట్స్ పరిశ్రమకు ఊపిరిపోస్తుంది అనుకున్న ఒడిఒపి కూడా ఒట్టిదే అని ఆచరణలో తేలింది. ప్రభుత్వాల సాయం లేకపోవడంతో ఈ పరిశ్రమ రోజురోజుకు కూనారిల్లుతూనే ఉంది. యూనిట్స్ అనేక మూతపడుతుండటంతో దీనిపై ఆధారపడి కార్మికులు ఇతర పనుల్లోకి వెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. మారుతున్న వ్యాపార ధోరణికి అనుగుణమైన మార్పులు చోటు చేసుకోకపోవడం, అందుకు తగ్గట్టు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో గార్మెంట్ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది.

జీన్ గార్మెంట్స్లో పని చేస్తున్న కార్మికులు

మూతబడిన టెక్స్టైల్ పార్కు కామన్ స్పెషిలిటీ సెంటర్

- నానాటికీ దిగజారుతున్న గార్మెంట్స్ పరిశ్రమ
- మూతపడ్డ శిక్షణ కేంద్రం
- ఉపాధికి దూరం అవుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయదుర్గం ప్రాంతంలో పెద్ద యూనిట్స్గా ఉన్నవి సుమారు 200 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా టెక్స్టైల్స్ పార్కులో ఎనిమిది యూనిట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా గార్మెంట్ దస్తుల తయారీలో కట్టింగ్, స్టిచ్చింగ్, డ్రైయింగ్, ఐరన్, ప్యాకింగ్ ఇలా వివిధ విభాగాలుంటాయి. ఇవన్నీ కలిపి ఒకేచోట ఉన్న పెద్ద పరిశ్రమలూ ఉన్నాయి. అలా కాకుండా ఏ విభాగానికి ఆవిభాగం విడివిడిగానున్న యూనిట్స్ ఉన్నాయి. ప్రధానంగా స్టిచ్చింగ్లో రాయదుర్గం పట్టణంలోనే సుమారు 600 యూనిట్స్ వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ స్టిచ్చింగ్ యూనిట్స్ వరకే చూస్తే సుమారు 50 శాతం వరకు అంటే 300కుపైగా యూనిట్స్ మూతపడ్డాయి. ఉన్న యూనిట్స్లోనూ గతం అంత పనిలేదని యజమానులు చెబుతున్నారు. మొత్తం ఒకేచోటనున్న పెద్ద పరిశ్రమలు టెక్స్టైల్ పార్కులో ఎనిమిది ఉండగా అందులో ఐదు మూతపడ్డాయి. కేవలం మూడు మాత్రమే నడుస్తున్నాయి. టెక్స్లైట్స్ పార్కులో 54 యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా సౌకర్యాలున్నాయి. అయినా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మూతబడిన టెక్స్పార్కు

జీన్స్ ప్యాంట్లకు స్టిచ్చింగ్ చేస్తున్న కార్మికుడు

ఒడిఒపి కింద ఉన్నా ప్రయోజనం శూన్యం

రాయదుర్గం గార్మెంట్ పరిశ్రమను ఒడిఒపి కింద ఎంపిక చేశారు. దీన్ని ప్రోత్సహిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తగ్గట్టుగా తగిన ప్రోత్సహం ప్రభుత్వాల వైపు నుంచి ఉండటం లేదు. కనీసం ఎంఎస్ఎంఇలకు ఇవ్వాల్సిన ఇన్సెంటీవ్లు కూడా ఇవ్వడం లేదు. విద్యుత్ ఇన్సెంటీవ్లు బకాయిలే ఉన్నాయి. ఇక కనీసం ఈ వృత్తిలోకి కొత్తగా వచ్చే వారికి ఇస్తామని ప్రకటించిన శిక్షణ కూడా ఉండటం లేదు. ఈ రకంగా శిక్షణిస్తామని ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఒక సంస్థతో చేనేత జౌళి శాఖ ఒప్పందం కూడా చేసుకుంది. ఆచరణలోకి అదీ రాలేదు. శిక్షణ కోసం ఏర్పాటు చేసిన భవనాలున్నా ప్రయోజనం లేకుండా ఉంది.

మూసేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి...

రాయదుర్గంలోని టెక్స్లైట్స్ పార్కులో ఉన్న తన యూనిట్లో వంద మందికిపైగా కార్మికులు పనిచేసేవారు. మొదటి జీఎస్టీ వచ్చాక దాన్ని అవగాహన చేసుకోవడానికి ఒకటిన్నర సంవత్సరం సమయం పట్టింది. అది సరిచేసుకునేలోపు కోవిడ్ వచ్చి లాక్డౌన్ వచ్చింది. లాక్డౌన్తో ఆ ఏడాది అంతా పనిలేకుండాపోయింది. పరిశ్రమ ఏర్పాటు కోసం చేసిన బ్యాంకు రుణభారం తలకు మించిన భారమైంది. ఇంకోవైపు ప్రభుత్వమిస్తామన్న ప్రోత్సహకమూ సకాలంలో ఇవ్వలేదు. ఇక కోవిడ్ కారణంగా మార్కెట్లో సరుకుకు అంత డిమాండ్ లేకుండాపోయింది. అంతేకాకుండా అప్పటి నుంచి ఈ-కామర్సు వ్యాపారం పెరిగింది. అప్పటి వరకున్న ఆఫ్లైన్ వ్యాపారం మొత్తం దెబ్బతినిపోయింది. ఈ -కామర్సు వ్యాపారం చేయాలంటే ఆ కంపెనీలకు తగ్గట్టు సరుకు పెద్దఎత్తున ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అది సాధ్యపడని పరిస్థితుల్లో పరిశ్రమలను మూతేసుకోవాల్సి వచ్చింది.

ఖలీల్, మూతపడ్డ పరిశ్రమ యజమాని.

గార్మెంట్స్ పరిశ్రమ బాగా దెబ్బతింది..

రాయదుర్గంలో సుమారు 200 యూనిట్స్ ఉన్నాయి. ఇందులో 20 నుంచి 30 యూనిట్స్ మూతపడ్డాయి. తక్కినవి కూడా అంత ఆశాజనకంగా లేవు. కోవిడ్, నోట్ల రద్దు, జీఎస్టీ ఇలా అన్ని రకాలుగా వ్యాపారంపై దెబ్బ పడింది. ఇప్పటికీ అది కోలకోలేదు. అంతకు మునపు ఉన్నంత డిమాండ్ ఇప్పుడు లేదు. పైగా ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో గిట్టుబాటు కూడా అయ్యే పరిస్థితి లేకుండా ఉంది. పరిశ్రమలు మూతపడుతుండటంతో అనేక మంది ఈ రంగం నుంచి ఇతర వృత్తుల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రోత్సహకాలను అందించడంతోపాటు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపైనా దృష్టి సారించాలి.

వెంకటేశ్ , రాయదుర్గం గార్మెంట్ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి.

ఈ రంగం నుంచి తప్పకున్నా..

20 సంవత్సరాలుగా గార్మెంట్లో స్టిచ్చింగ్ కార్మికునిగా పనిచేస్తున్నాను. స్వయంగా నేను కుట్టడమే కాకుండా నాతోపాటు మరో 30 మంది చేత స్టిచ్చింగ్ చేయించేవాడిని. గడిచిన రెండేళ్లుగా అనుకున్నంతగా ఆర్డర్లు రావడం లేదు. సాధారణంగా వినాయకచవితి సమయంలో వారానికి మూడు వేల వరకు ఫ్యాంట్లు కుట్టడానికి ఆర్డరు వచ్చేవి. ఇప్పుడు కనీసం వెయ్యి కూడా రావడం లేదు. ఇక నేను ఏమి తినాలి... నాతోపాటున్న వారికి ఏమివ్వాలి. అందుకే గిట్టుబాటు కాక మూతేసుకున్నాను. వేరే పని కోసం వెతుక్కుంటూ ఉన్నాను.

సురేష్, స్టిచ్చింగ్ కార్మికుడు.

అనంత ఎస్పీగా పి.జగదీష్
28 రోజులకే బదిలీ అయిన మురళీకృష్ణ

నూతన ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా ఎస్పీగా కెవి.మురళీకృష్ణ బాధ్యతలు తీసుకున్న 28 రోజులకే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పి.జగదీశ్ను నియమించారు. జులై 13న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్పీల బదిలీల్లో భాగంగా అనకాపల్లి ఎస్పీగానున్న కెవి.మురళీకృష్ణ అనంతపురం ఎస్పీగా వచ్చారు. జులై 18వ తేదీన అనంతపురం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా బాధ్యతలు చేపట్టిన 28 రోజులకే ఆయనకు మరోమారు బదిలీ వచ్చింది. ఇంత స్వల్ప కాలంలో బదిలీకి కారణాలేమిటన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది. ఆయన వ్యక్తిగత అభ్యర్థన మేరకు ఈ బదిలీ జరిగిందన్న చర్చ కూడా అధికారవర్గాల్లో నడుస్తోంది. మురళీకృష్ణ స్థానంలో పి.జగదీశ్ను ప్రభుత్వం అనంత కొత్త ఎస్పీగా నియమించింది. ఈయన్ను కూడా జులై 13వ తేదీ బదిలీల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీ చేసినప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ఇప్పుడు ఆయన్ను అనంతపురం ఎస్పీగా బదిలీ చేశారు. 2017వ బ్యాచ్కు చెందిన పి.జగదీశ్ అసిస్టెంట్ కమాండెంట్ గ్రేహౌండ్స్కు పనిచేశారు. ఆ తరువాత పాడేరు అదనపు ఎస్పీగా పనిచేశారు. 2022లో జరిగిన ఐపిఎస్ల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. ఏప్రిల్ 2023లో ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది, అనంతపురం ఎపిఎస్పీ కమాండెంట్గా నియమితులయ్యారు. 2023 సెప్టంబర్లో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ ఏడాది జులై 13న అక్కడి నుంచి బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆయన అనంతపురం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు.

పీజీ డాక్టర్లు, మెడికోల ఆందోళన

ప్రజాశక్తి- అనంతపురం అర్బన్

కోల్కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యోదంతంలో నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ అనంతపురంలో పీజీ డాక్టర్లు, మెడికోలు శుక్రవారం నాడు కూడా ఆందోళన కొనసాగించారు. వీరికి ఆర్ఎంఒలు డాక్టర్ గుజ్జుల హేమలత, డాక్టర్ పద్మజ సంఘీభావం తెలిపారు. ఈ సంధర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా ఏం చేసుకుంటారో చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం అత్యంత క్రూరం అన్నారు. ఇటువంటి వారిని ఉరి తీసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న వైద్యులు, మెడికోలు

రాయదుర్గం రూరల్ సిఐగా వెంకటరమణ

రాయదుర్గం : రూరల్ సిఐగా కె.వెంకటరమణ శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ప్రొద్దుటూరు నుంచి ఇక్కడికి వచ్చారు. నూతన సిఐ విలేకరులతో మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మగట్ట మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఛేంజ్ ఫర్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. గ్రామంలోని మటం వన్నూరమ్మ మతిస్థిమితం లేని కుమార్తె సరోజమ్మ, మనవడు ఓబలేసును పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతుందని పాస్టర్ మాంతేశ్ ఛేంజ్ ఫర్ సొసైటీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సొసైటీ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ. 5,150తో పాటు సొసైటీ నిధులతో ఆ కుటుంబానికి రూ. 8వేల పైచిలుకు విలువ చేసే నిత్యావసర సరుకులను స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షులు బిఎం.నాదల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పిడి. వన్నూరప్ప, పాస్టర్ సాల్మన్ హంపన్న, పాస్టర్ మాంతేశ్ ద్వారా అందజేశారు. కుటుంబ సభ్యులు అంగీకరిస్తే మతి స్థిమితం లేని ఇద్దరినీ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో చేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఛేంజ్ ఫర్ సొసైటీ సభ్యులు మంజునాథ్, రోజా, అనిత, తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రథమ సంవత్సర విద్యార్థిను లతో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డి.విజయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ బాలుర, డి.హీరేహాల్, కణేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్లు కె.వీరేష్, ఎం.రాజగోపాల్, ఆంజనేయులు, రిటైర్డ్ ఇంగ్లీష్ లెక్చరర్ అయూబ్ ఖాన్, టిడిపి పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్డేలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

వైసిపి హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం వేల కోట్ల పంచాయతీ నిధులను దారి మళ్లించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి విద్యావతి అధ్యక్షతన, ఇన్ఛార్జి ఎంపిడిఒ చిక్కన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు గ్రామాలకు ప్రజాప్రతినిధులు, నేను రాయ దుర్గం నియోజకవర్గానికి ప్రతినిధిని, సమిష్టిగా రాయదుర్గం మండల అభివృద్ధిలో భాగస్వాములవు దామని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ నిధులను పలు శాఖలకు అనుసంధానిస్తూ అభివృద్ధి పనులు చేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో 25 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. అత్యవసర పనులపై గ్రామస్థాయిలో ప్రతిపాదనలు ఇస్తే మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. పోటీ చేసిన స్థానాల్లో 93శాతం మంది అభ్యర్థులు ఓ పార్టీ నుంచి గెలవడం ఇప్పటి వరకూ జరగలేదన్నారు. కూట మి ప్రభుత్వం 164 స్థానాల్లో గెలుపొంది ప్రజాభిమానాన్ని పెద్దఎత్తున కూడగట్టిందన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయంగా రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందజేస్తామన్నారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో అత్యవ సర వైద్య సేవలు పొందిన వారికి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అందరి సహకారంతో రాయదుర్గం మండలం అభివృద్ధికి కషి చేస్తానన్నారు. గ్రామదట్ల, జుంజురంపల్లి సర్పంచులు రాజశేఖర్రెడ్డి, వన్నూరుస్వామి మాట్లాడారు. అంతకు ముందు వ్యవసాయ, ఉద్యాన, హౌసింగ్, సిరికల్చర్, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య, వెలుగు, రెవెన్యూ, తదితర శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. సమావేశంలో జడ్పిటిసి మల్లికార్జున, ఈవోఆర్డి శ్రీరంగనాయకులు, వ్యవసాయ అధికారి మహేంద్ర, హార్టికల్చర్ అధికారి మౌనిక, పంచాయతీ కార్యదర్శులు వేణు, కొల్లప్ప, హేమంత్, భీమేష్, అశోక్, బసవరాజు, శ్రీదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోకు పల్లెవెలుగు నూతన బస్సు మంజూరైంది. ఆ బస్సు సర్వీసును కళ్యాణదుర్గం వయా గుండ్లపల్లి బళ్లారికి కేటాయించారు. ఆర్టీసీ అధికారులు బస్సును ప్రజావేదిక వద్దకు తీసుకురాగా శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అలాగే బస్సును నడిపి స్థానిక అధికారులు, నాయకులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

పారిశుధ్యం మెరుగు కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సురేంద్ర బాబు తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పనులు చేపట్టేందుకు ట్రాక్టర్లు మంజూరు చేశారన్నారు. మొదటి విడతలో కళ్యాణదుర్గం మండలానికి ఏడు, కంబదూరు మండలానికి ఐదు ట్రాక్టర్లను మంజూరు చేశారన్నారు. వాటిని ఆయా మండలాల్లో ఎంపిడిఒల ఆధ్వర్యంలో ప్రారంభించి గ్రామ పంచాయతీలకు అప్పజెబు తారన్నారు. మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల్లో మురికివాడల్లో పారిశుధ్యం చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో డ్రెయినేజీలతో పాటు వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి చెత్తచెదారని ట్రాక్టర్ల సాయంతో బయటకు తరలించాలన్నారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, గోళ్ల వెంకటేశులు, డికె. రామాంజనేయులు, రాజశేఖర్చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

గోవిందయ్యదొడ్డిలో రంగుమారిన నీరు సరఫరా

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

తాగునీటి కుళాయిలో వస్తున్న రంగు మారిన నీరు

మండలంలోని వేపులపర్తి పంచాయతీ పరిధిలోని గోవిందయ్యదొడ్డి(బయలుదొడ్డి) గ్రామంలో పంచాయతీ ఏర్పాటు చేసిన కుళాయిల్లో రంగుమారిన నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. గోవిందయ్యదొడ్డి గ్రామంలో 170 నివాసాలు ఉండగా 847 జనాభా ఉంది. గ్రామానికి పంచాయతీ బోరు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా తాగునీరు సర ఫరా అవుతున్నాయి. నాలుగు రోజుల నుంచి గ్రామంలో తాగునీటి సమస్య జఠిలమైంది. దీంతో పంచా యతీ అధికారులు మూడేళ్ల క్రితం గ్రామ సమీపంలోని కప్పలచెరువులో వేసిన బోరు నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. కుళాయిల్లో బంక మట్టితో కూడిన రంగు మారిన నీరు సరఫరా అవుతుంది. దీంతో రంగు మారిన నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరు అందించా లని గ్రామస్తులు కోరుతున్నారు.

భ్రూణ హత్యలను నిరోధించాలి : ఆర్డిఒ

బహ్మసముద్రం : శిశు, భ్రూణ హత్యలను నిరోధించడమే ప్రభుత్వ లక్ష్యమని, పిసి, పిఎన్డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భ్రూణ హత్యల నిరోధక చట్టం అమలు కమిటీ ఛైర్పర్సన్, కళ్యాణదుర్గం ఆర్డిఒ రాణిసుస్మిత తెలిపారు. ఆర్డిఒ శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిసి, పిఎన్డిటి అమలుపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం
కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, ఎస్పీ మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేలా అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, ఎస్పీ మురళీకృష్ణ తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్సిఒఆర్డి (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకునేలా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ వాడడం వల్ల కలిగే వ్యతిరేక ప్రయోజనాలను క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు. జిల్లాలో అన్ని మెడికల్ షాపుల్లో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించాలన్నారు. సోషల్ వెల్ఫేర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డి-అడిక్షన్ వార్డులో అంకితభావంతో పనిచేసే సిబ్బందిని నియమించాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు బస్సుల్లో ఎక్కడైనా డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నారా అనే దానిపై తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, లాంటివి సాగు, రవాణా చేయకుండా చూడాలన్నారు. ఎస్పీ కెవి.మురళీకష్ణ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గ్రామాల వారీగా వాహనం ఏర్పాటు చేసి వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వీడియోల ద్వారా ప్రదర్శించాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నో డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ రామకృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిలు చెల్లిస్తేనే నూతన రుణాలు : ఎపిఎం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల వ్యాప్తంగా నాలుగు క్లస్టర్ల పరిధిలో ఉన్న స్త్రీ నిధి బకాయిలను త్వరితగతిన చెల్లిస్తేనే నూతన రుణాల మంజూరుకు వెలుగు శాఖ కృషి చేస్తుందని ఎపిఎం నీలమణి స్పష్టం చేశారు. ఆమె శుక్రవారం మండలంలోని ఎరడికెర, పొబ్బర్లపల్లి, కపటలింగన్నపల్లి, తదితర గ్రామాల్లో సంఘం సభ్యుల తో రికవరీ, నూతన రుణాల మంజూరుపై లబ్ధిదారులకు వివరించారు. జీవనోపాధి మెరుగుపరచుకొని ఆదాయ, అభివృద్ధి పనులు చేసుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలనే ప్రభుత్వ సంకల్పానికి ప్రతి మహిళ నడుం బిగించాలన్నారు. ప్రతి సంఘం సభ్యురాలు పాత బకాయిని చెల్లించి నూతన రుణాల మంజూరుకు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు మంజులమ్మ, ఆయా గ్రామాల యానిమేటర్లు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నేత వీరాంజనేయులు మృతికి నివాళి

అనంతపురం కలెక్టరేట్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన టిడిపి సంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నిబద్ధత కలిగిన వ్యక్తి వీరాంజనేయులు అన్నారు. నమ్మిన టిడిపిలో సుదీర్ఘ కాలం పని చేశారని తెలిపారు. ఇతర పార్టీల పట్ల ముఖ్యంగా సిపిఎం పట్ల ఎంతో గౌరవంతో, అందులో పనిచేసే వ్యక్తులపట్ల అభిమానంతో ఉండేవారని కొనియాడారు. అలాగే ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరాంజనేయులు లేనిలోటు పార్టీకి ఊహించలేకపోతున్నామన్నారు. ఎందుకంటే పార్టీ నుంచి కార్యక్రమం జరిగినా ఆయన గొంతు ప్రతిధ్వనిస్తుంటుందని గుర్తు చేశారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అలాంటి నాయకుడు మృతిచెందడం బాధాకరమన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

ఏపి కౌలు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

ఈదురు గాలులకు మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపి కౌలు రైతుసంఘం, రైతుసంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అరకటవేముల గ్రామంలో ఈదురుగాలులకు నేలకొరిగిన కౌలు రైతు నాగేంద్ర సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని రైతులు నిత్యం అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతూనే ఉన్నారన్నారు. ఈసారైనా పంట వస్తుందనుకుంటే ఈదురుగాలులకు పంట నష్టం జరగడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం మండల ఉపాధ్యక్షుడు బి.చిన్నకృష్ణుడు, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, మండల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.కుళ్లాయప్ప, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి గోపాలకృష్ణ, మండల నాయకులు బాలకొండయ్య, పి.కుళ్లాయప్ప, ఆంజనేయులు, రైతులు, మీసాలనాగేంద్ర, మీసాల నాగరాజు, నల్లమల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏపి కౌలు, రైతుసంఘం నాయకులు

'రోటరాక్ట్'తో నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థులు రోటరాక్ట్‌లో చేరడం వల్ల ఆత్మవిశ్వాసంతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చునిరోటరీ జిల్లా గవర్నర్ రోటేరియన్ పి.కేశవరెడ్డి అన్నారు. కళాశాల రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా మెకానికల్ విభాగం 3వ సంవత్సరం చదువుతున్న ఎం.మహమ్మద్ ఇలియాజ్, కార్యదర్శిగా ఇఇఇ విభాగం 3వ సంవత్సరం చదువుతున్న కె.మాధవీలతను నియమించారు. ఈమేరకు శుక్రవారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటిలో రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరాక్ట్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలతోపాటు పబ్లిక్ స్పీకింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, టీమ్-బిల్డింగ్ సామర్థ్యాలను మెరుగు పరచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ వీధి బాలల సంక్షేమ ఛైర్మన్ రోటేరియన్ కె.శాంతరాజ్, రోటేరియన్ తేజ, నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ, సివిల్ విభాగాధిపతి చిన్న వెంకటరెడ్డి, రోటరాక్ట్ క్లబ్ సలహాదారు పి.వెంకట సునీల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.నాగలక్ష్మి, అరవింద్‌బాబు, రోటరాక్టు విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథులను సన్మానిస్తున్న 'రోటరాక్ట్' సభ్యులు

మంత్రి పయ్యావులను కలిసిన నాయకులు

శింగనమల : అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను టిడిపి అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శింగనమల మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటప్ప, సీనియర్ నాయకులు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బీసీ సెల్ అధికార ప్రతినిధి బండి పరశురామ్, బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

అనంతపురం : కెనరా బ్యాంకు డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్షిప్ పథకం కింద కెనరా బ్యాంకు అనంతపురం ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో 5 నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 360 మందికి ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఏజిఎం ఎం.లారెన్స్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. 11 ఏళ్లుగా ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో కెనరా బ్యాంకు ఎప్పుడూ ముందుంటుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఐ.శివరంగప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ఎ.వి.రమణ, బి.నరసింగారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో కెనరా బ్యాంకు సిబ్బంది

సంక్లిష్ట పరిస్థితుల్లో వైద్య, ఆరోగ్యరంగం

ప్రజారోగ్య వేదిక కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత సమాజంలో వైద్య, ఆరోగ్య రంగం అత్యంత ఖరీదైన వస్తువుగా మారి సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందని ప్రజారోగ్య వేదిక కార్యదర్శి మెడికల్ రిప్రజెంటివ్ శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందన్నారు. నియంత్రణ వైపు చూస్తున్న పరిశీలన విభాగం ఆ వైపు చూడటం లేకపోవడంతో అత్యంత ఖరీదైన వస్తువుగా ఆరోగ్యం మారిందన్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టినా నివారణ సాధ్యం కాని పరిస్థితుల్లో ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలోని లోపాలే ఈ పరిస్థితికి కారణమన్నారు. ఇక్కడ ఏ వ్యాధికీ పూర్తిగా నిర్మూలన లేదన్నారు. ఆ వ్యాధి ఎప్పుడైనా రిపీట్ అవ్వచ్చు. జాతీయంగా, అంతర్ జాతీయంగాగానీ వ్యాధుల పూర్తి నిర్మూలన కోసం ఎక్కడా రీసెర్చ్ జరగడం లేదన్నారు. ప్రభుత్వాలు కూడా వ్యాధి రాకుండా ముందస్తు నివారణ చర్యలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రోగాలు వచ్చిన తర్వాత నివారణ గురించి ఆలోచన చేస్తున్నాయన్నారు. అందువల్ల ఈ రంగంలో వ్యాపారం పెంచుకోవడం కోసం చాలా అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. ప్రజల్లో ఎక్కువ మందికి ఈ వ్యాపారం అర్థం కావడం లేదన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా రీసెర్చ్ పరిశీలిస్తే వ్యాధి పూర్తి నివారణ కోసం జరగడం లేదుగానీ, వ్యాధిని పొడిగించి మనిషిని బతికించాడానికి మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. కరోనా వైరస్ వచ్చినప్పుడు మనకు ఈ వ్యాపారం పూర్తిగా అర్థమయిందన్నారు.

మెడికల్ సీట్ల కోసం జరిగిన పరీక్ష ద్వారా, మెడికల్ సీట్లను రూ.కోట్లు వెచ్చించి కొనుక్కునే పద్ధతి, మందుల రంగం అవినీతి, సర్జికల్, రక్తం అవినీతి, అన్ని రకాల వ్యాధి పరీక్షల్లో ఎక్కువ శాతం అవినీతి రాజ్యమేలుతోందన్నారు. అవినీతి వల్లే అందరికీ ఆరోగ్యం అందడం లేదన్నారు. డబ్బుతో సంబంధం లేని ఉచిత వైద్యాన్ని అందించాలని ప్రభుత్వాలను కోరాలని సూచించారు. అప్పుడు మాత్రమే ఈ అవినీతి వ్యాపారాన్ని ఆపే సాధ్యమన్నారు. ప్రభుత్వం కూడా ప్రజలకు వివిధ రకాల కార్పొరేట్ పథకాలను తీసుకొచ్చి కార్పొరేట్లు వైద్యం వైపునకు నడిపిస్తోందన్నారు. ఈ పద్ధతి ఆప్లాన్నారు. ఓట్ల రాజకీయం ఉన్నంత కాలం ఈ వ్యాపారం జరుగుతూనే ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది ప్రజలు వారి ఆదాయంలో 80శాతం విద్య, ఆరోగ్యానికి ఖర్చు పెడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కావున ప్రజలు వీటిని గమనించాలన్నారు.

నేడు వైద్యసేవలు నిలిపివేత : ఐఎంఎ

ప్రజాశక్తి-అనంతపురం

కోల్‌కతాలో మహిళా వైద్యురాలి సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం నుంచి 24 గంటల పాటు వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ఐఎంఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అభిషేక్‌రెడ్డి, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ అన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలను మినహాయించి, ఓపి, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలను పూర్తి స్థాయిలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కూడా 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఐఎంఎ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ పి. ప్రసూన, డాక్టర్ బాబా యూనస్, వాల్మీకి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ సుప్రజా చౌదరి, భాను కిరణ్, సోమనాథ్ మాట్లాడుతూ వైద్యురాలికి జరిగిన అన్యాయాన్ని ప్రజలందరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.తమ నిరసనకు ప్రజలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎంఎస్ఆర్‌యు మద్దతు

అనంతపురం కలెక్టరేట్ : కోల్‌కత్తా వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చేపట్టిన నిరసనకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంజునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ డాక్టర్లపై కొంతమంది దుండగులు అమానుషంగా వ్యవహరించి క్రూరంగా వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్ఘటనపై నిష్పక్షపాతంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించేలా చూడాలని డిమాండ్ చేశారు.

'రాక్రీట్'పై నిష్పక్షపాతంగా విచారణ సాగాలి

అక్రమాల నుంచి మాజీ ఎమ్మెల్యే తప్పించుకోలేడు-ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాక్రీట్ సంస్థ ద్వారా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన అక్రమాలపై నిష్పక్షపాతంగా విజిలెన్స్ విచారణ సాగాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ప్రకాష్‌రెడ్డి రూ.200కోట్ల మేర అక్రమాలు చేశారని ఆరోపించారు. రాక్రీట్ సంస్థ ద్వారా 50వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇసుక, సిమెంట్, ఐరన్ ఇతర వాటిల్లో భారీగా దోచేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్ఆర్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని గృహ నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయన్నారు. గతంలోనే 13వేల ఇళ్ల నిర్మాణాలు రాక్రీట్ సంస్థకు రద్దు చేశారన్నారు. ఇళ్లు నిర్మించకుండానే చాలా వరకు బిల్లులు చెల్లించారన్నారు. ఒక్కో ఇల్లు బేస్ మెంట్ స్థాయి వరకు నిర్మించాక.. మొదటి విడతగా రూ.60 వేలు చెల్లించాలని.. కానీ ఆయా జిల్లాల్లో రాక్రీట్ సంస్థకు మాత్రం అధికారులు ప్రత్యేకంగా పరిగణించి.. ఇళ్లు పూర్తయినట్టు కాగితాల్లో చూపించి బిల్లులు చేసుకున్నారన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ పేరుతో పెద్ద ఎత్తున నిధులు దోపిడీ జరిగిందన్నారు. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించకుండా బిల్లులు కాజేశారని ధ్వజమెత్తారు. అలాగే ఒకే పేరుతో పదుల సంఖ్యలు ఇళ్లు తీసుకున్నారన్నారు. దీనిపై ఇప్పటికే సిఎం చంద్రబాబుతోపాటు గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారధికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం సంతోషకరమన్నారు. ప్రకాష్‌రెడ్డి అక్రమాలపై గతంలోనే హౌసింగ్ అధికారులు ఒక నివేదిక సిద్ధం చేశారని, అయితే నివేదిక బయటకు రాకుండా అధికారం అండతో తొక్కి పెట్టారన్నారు. ఆ నివేదికను తీసుకుంటే రాక్రీట్ అక్రమాలు బయటకొస్తాయన్నారు. ప్రజా సొమ్మును దోచుకున్న ప్రకాష్ రెడ్డి నుంచి ఆ సొమ్ము రికవరీ చేయాలన్నారు.

మాట్లాడుతున్న పరిటాల సునీత

జీవో 117 రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యారంగానికి ఆటంకం కలిగిస్తున్న జీవో 117ను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం అనంతపురంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎపిటిఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉపాధ్యాయ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా జీవో 117ను రద్దు చేసి సమాంతర తెలుగు ఆంగ్లం బోధన మాధ్యమాల కొనసాగించాలని, పని విభజనకు ముందే ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, సతీష్‌కుమార్, ఓబులేసు, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, జిల్లా నాయకులు రామకృష్ణ, సూర్యనారాయణ, అడవిరాజు, తిప్పేస్వామి, ఓబిలేసు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులకు ఎపిటిఎఫ్ నేతల వినతి

మంత్రి పయ్యావులకు వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నేతలు

'దిగు.. కిందకు దిగిపో..'

మండల సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడి నిర్వాకం-డిటికి అవమానం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సమావేశాలు పద్ధతి ప్రకారం నిర్వహించేందుకు ప్రోటోకాల్ ఉంటుంది. హోదా, పదవి లాంటి వాటికి ఇవ్వాల్సిన స్థానం, గౌరవం, నడుచుకునే విధానం సమావేశంలో తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అధికారుల అవగాహన రాహిత్యం, వ్యక్తిగత ఇష్టాలు, రాజకీయ పార్టీలపై ఉన్న మక్కువ, బంధుప్రీతి లాంటి వాటితో ప్రోటోకాల్‌ను పక్కన పెట్టేస్తున్నారు. సరిగ్గా ఇలాంటి సన్నివేశమే శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో చోటుచేసుకుంది. ఎంపిపి విద్యావతి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చిక్కన్న కో ఆప్షన్ సభ్యుడు దిలావర్(వైసిపి)ను వేదికపైకి ఆహ్వానించారు. ప్రతి సమావేశంలో ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిడిఒ, తహశీల్దార్లు మాత్రమే వేదికపై ఆశీనులయ్యేవారు. హోదాకు తగ్గట్టుగా మండల పరిషత్ సిబ్బంది హాజరయ్యే వారి కోసం స్థానాలు ఏర్పాటు చేసేవారు. ఇందుకు భిన్నంగా వేదికపై కో ఆప్షన్ సభ్యుడు దిలావర్‌ను కూర్చోబెట్టడంతో మండల పరిషత్ సిబ్బంది, సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆలస్యంగా వచ్చిన డిప్యూటీ తహశీ ల్దార్ రఘు కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ పక్కన (వేదికకు చివరన) కూర్చున్నారు. సమావేశం పూర్తయ్యే సమయంలో ఎమ్మెల్యే రావడంతో అందరూ లేచి నిలబడ్డారు. వేదికపై కుర్చీలు తక్కువగా ఉన్న విషయాన్ని గ్రహించిన కో ఆప్షన్ సభ్యుడు తనను ఎక్కడ వేదిక నుంచి కిందకు దించేస్తారోననే ఆత్రుతతో 'దిగు... కిందకు దిగిపో అంటూ డిప్యూటీ తహశీల్దార్‌ను కిందకు పంపించి ఆ స్థానంలో ఆయన కూర్చున్నాడు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ రఘు విభిన్న ప్రతిభావంతుడు. అవమానానికి గురైన రఘు చేసేదేమీ లేక కింద పాత్రికేయులకు కేటాయించిన కుర్చీలో వచ్చి కూర్చున్నాడు. ఈ విషయాన్ని పాత్రికేయులు డిప్యూటీ తహశీల్దార్ వద్ద ప్రస్తావించగా 'కో ఆప్షన్ సభ్యుడు తనను పో.. కిందకు దిగిపో..' అని అన్నాడని వాపోయాడు. ఇదే విషయంపై ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చిక్కన్నను వివరణ కోరగా కొన్ని చోట్ల కోఆప్షన్ సభ్యులను కూడా వేదికపై కూర్చోబెడుతుంటారు. ఇదేమీ పెద్దగా పట్టించుకోవద్దు. కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ తన స్నేహితుడు అని సమాధానం ఇచ్చారు.

మంత్రి పయ్యావులను కలిసిన అపుస్మా నాయకులు

అనంతపురం : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ప్రయివేటు పాఠశాలల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అపుస్మా సెక్రటరీ చంద్ర, టౌన్ ప్రెసిడెంట్ శ్రీనాథ్, రవిశంకర్, ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అన్వర్, జలీల్, రామ్మూర్తి, లక్ష్మణ్, లోక్‌నాథ్, రామ్మోహన్, సంజీవరెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అపుస్మా నాయకులు

నేడు ఎస్ఎంసి ఎన్నికలు

నార్పల : ఇటీవల వాయిదా పడిన పాఠశాలల ఛైర్మన్ల ఎంపిక ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు మండల పరిధిలోని బండ్లపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలల్లో ఎస్ఎంసి ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. వాయిదా పడ్డ పాఠశాలల్లో ఎన్నికలు జరగనుండటంతో ఉత్కంఠ నెలకొంది.

రూరల్ ఎస్ఐకి సన్మానం

అనంతపురం : అనంతపురం రూరల్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్యను ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న పెద్దన్న, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు యు.రమణ, టిడిపి నాయకులు కురుగుంట నారాయణస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డే రాజేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు చెన్నంపల్లి ఓబులేసు, మురళి, దిమ్మగుడి రామాంజి, చిన్నోబిలేసు, రామకృష్ణ, సత్యమయ్య, కుంటెన్న, ఓబులేసు, నాగరాజు, మల్లికార్జున, హరి, తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలి

శింగనమల : మండల వ్యాప్తంగా చేనేత కార్మికులకు 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మధు కోరారు. ఈమేరకు అనంతపురంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేసే మధు, శంకర్, రామాంజనేయులు, గురుప్రసాద్, రంగయ్య, మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బెలుగుప్ప : మండల కేంద్రానికి చెందిన పూర్వ విద్యార్థి బోయ సిగరెట్ల ఆంజనేయులు కుటుంబానికి తోటి స్నేహితులు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఆంజనేయులు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2004-2005లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆంజనేయులు ఇంటికి చేరుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు భార్య శారద, ముగ్గురు పిల్లలను పరామర్శించారు. తర్వాత రూ.1.1లక్షలు ఆర్థికసాయంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఎసి సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా సూర్యనారాయణ

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా సూర్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ ఆనందరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

18న రాజ్యాంగ అవగాహన సదస్సు

గుత్తి : ఈనెల 18వ తేదీన గుత్తిలో అఖిలభారత వెనుకబడిన, బలహీన సామాజిక ఉద్యోగుల సమాఖ్య (బిఎఎంసిఇఎఫ్) ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తిలోని వసుధ ఫంక్షన్ హాల్ లో జరిగే సదస్సుకు రిటైర్డ్ జడ్జి ఎం.కిష్టప్ప, ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సంపత్ కుమార్, బిఎఎంసిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి బివిఎన్. సత్యనారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సుకు బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఉద్యోగులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

బాలుర వసతి గృహం తనిఖీ

శింగనమల : కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహాన్ని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ హనుమాన్ ప్రసాద్. హాస్టల్ వార్డెన్ మస్తాన్, విఆర్ఒ తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్ బ్రహ్మయ్య

ఉత్తమ అధికారులకు అభినందనలు

నార్పల : ఉత్తమ అవార్డులు అందుకున్న మండల పరిధిలోని బొందలవాడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, కేసేపల్లి గ్రామ సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులు రాజశేఖర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పయ్యావుల కేశవ్‌తో అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. దీంతో వారిద్దరినీ మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సహ సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆశా కార్యకర్తకు సన్మానం

వజ్రకరూరు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమిద్యాల ఆశా కార్యకర్త తులసమ్మను ఎపి హంస జిల్లా కన్వీనర్ ఎస్ఎండి షఫీ ఆధ్వర్యంలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఘనంగా సత్కరించారు. ఆడపిల్లలు పుట్టక ముందే భ్రూణ హత్యలకు పాల్పడుతున్న నేటి రోజుల్లో తనకు మనవరాలు పుట్టడంతో సంతోషంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాని సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి వచ్చిన గర్భిణులు, సహాయకులకు ఆశా కార్యకర్త తులసమ్మ అన్నదానం చేసింది. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస ఉరవకొండ తాలూకా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగారంగయ్య, ప్రధాన కార్యదర్శి నిమ్మల వెంకటేష్, శేఖర్, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడిగా హెచ్.వన్నూరుస్వామి

వజ్రకరూరు : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి, బోయ సంఘం ఉరవకొండ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా విడపనకల్ మండలం ఉండబండ గ్రామానికి చెందిన హెచ్.వన్నూరుస్వామిని ఏకగ్రీవంగా నియమించినట్లు సంఘం రాష్ట్ర హైపవర్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వన్నూరుస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీలతోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి జాతి హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసి అందరినీ సమన్వయం పరుచుకుంటూ ముందుకు సాగుతామన్నారు. కాగా వన్నూరుస్వామిని నియోజకవర్గంలోని వాల్మీకులు అభినందించారు.

21న మండల సమావేశం

వజ్రకరూరు : ఈనెల 21న విడపనకల్లు మండలం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, కో ఆప్షన్ నెంబర్‌తో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు గుంతకల్లు డివిజినల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, గ్రామీణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల మొదటి వారంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దండోరా వేయించి రెవెన్యూ సదస్సు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హెచ్.ఓబిలేసు, ఉప తహశీల్దార్లు లలిత, శ్రీలత, ఆర్ఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటంక గ్రామంలో గురువారం రాత్రి 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తలిస్తుండగా గార్లదిన్నె పోలీసులు పట్టుకున్నారు. తహశీల్దార్ ఈరమ్మ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద గురువారం రాత్రి 11 గంటలకు సమయంలో బుక్కరాయసముద్రానికి చెందిన టిప్పుసుల్తాన్, అనంతపురానికి చెందిన మహేష్‌నాయక్ కలిసి వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని ఐచర్ వాహనంలోకి తరలిస్తుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం రావడంతో పోలీసుల పట్టుకుని బియ్యం తలుస్తున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్ తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

ఓఎంసీలో చోరీ యత్నం.. 9 మంది అరెస్ట్

డి.హీరేహాల్ : మండలంలోని ఓబులాపురం గ్రామ పరిధిలో ఉన్న ఓబులాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ)లో చోరీకి యత్నిస్తున్న 9 మంది వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఓఎంసీలో ఉన్న హిటాచి, జెసిబి, ఇతర మిషనరీని గతంలో సిబిఐ సీజ్ చేసిన విషయం తెలిసిందే. వీటిపై కన్నేసిన కొందరు వ్యక్తులు గ్యాస్ కట్టర్లతో మిషన్లను కట్ చేస్తుండగా గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి హుటా హుటిన ఆ ప్రాంతానికి చేరుకుని 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి గ్యాస్ కట్టర్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మరికొందరు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు.